క్లుప్తంగా

మెడికల్, హెల్త్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధాకర్


బండి సుధాకర్

జహీరాబాద్: తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జహీరాబాద్‌కు చెందిన బండి సుధాకర్ నియమితులయ్యారు. గురువారం సంగారెడ్డిలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయనను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. తనను నమ్మి పదవి ఇచ్చినందుకు రానున్న రోజుల్లో ఉద్యోగులు, కార్మికులకు వచ్చే అన్ని బెనిఫిట్లు లభించేలా అహర్నిశలు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు అప్పగించిన జిల్లా గౌరవ అధ్యక్షుడు భూపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఖేడ్‌లో చేగువేరా వర్ధంతి


నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

నారాయణఖేడ్: ప్రపంచ విప్లవకారుడు చేగువేరా 58వ వర్ధంతిని ఖేడ్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సంఘం నాయకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్ మాట్లాడుతూ.. చేగువేరా స్ఫూర్తితో సమానత్వం, న్యాయం, మానవ హక్కులు, సమాజమార్పు కోసం ప్రభుత్వాలపై పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఇతర బాధ్యులు రమేశ్, స్వరాజ్, యశ్వంత్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పాత్ర కీలకం


సమావేశంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఝరాసంగం(జహీరాబాద్): విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రధానోపాధ్యాయుడు మహేశ్ అన్నారు. గురువారం మండల పరిధి మాచ్నూర్‌లోని కేంద్రీయ విద్యాలయంలో పేరెంట్స్ సమావేశం నిర్వహించి, ఇంటర్మీడియట్ ఆఫ్ ఇయర్ పరీక్షల ప్రొగ్రెస్ కార్డులు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత అంబులెన్స్ సర్వీస్


ఒప్పంద పత్రాన్ని ఆస్పత్రి ప్రతినిధులకు ఇస్తున్న కమిషనర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మెదక్ ఎంపీ రఘునందన్‌రావు గతంలో తెల్లాపూర్ మున్సిపాలిటీకి అందించిన అంబులెన్స్ సర్వీస్ గురువారం నుంచి అందుబాటులోకి వచ్చింది. అంబులెన్స్ సిబ్బంది, డ్రైవర్‌ను అక్ష ఆస్పత్రి యాజమాన్యం అందించడానికి ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్ రెడ్డి, అక్ష ఆస్పత్రి యాజమాన్యంతో చర్చించారు. కార్యక్రమంలో అక్ష ఆస్పత్రి డైరెక్టర్ డా.మధుసూదన్, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

అండర్-17కు ఎంపిక



ఎంపికైన జిల్లా జట్టు

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి జిల్లా అండర్-17 క్రికెట్ జట్టుకు పటాన్‌చెరు పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ 69వ క్రీడల్లో భాగంగా అండర్-17 సంగారెడ్డి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు గురువారం పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఏపీఆర్ కాలనీకి చెందిన శ్రీజన్‌రెడ్డి, ఏపీఆర్ గ్రాండియో కాలనీకి చెందిన గౌతమ్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. జిల్లాస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక అవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు.

నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

- నెలరోజులుగా పత్తాలేని కాంట్రాక్టర్
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు


చిత్తడిగా మారిన రోడ్డు


మార్కెట్‌యార్డు ఎదుట నిలిచిన వర్షపు నీరు

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రం వట్‌పల్లిలో ప్రధాన రోడ్డు మార్గం అల్లాదుర్గ్- మెటకుంట ఆర్ అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో కిలో మీటరు మేర రోడ్డు విస్తరణతో పాటు డివైడర్ నిర్మాణం, ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.2.97 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మట్టి పనులు చేపట్టి వదిలేశారు. వర్షాలు పడిన సమయాల్లో రోడ్డు బురదమయంగా మారి నడవలేని దుస్థితికి చేరుకుంది. పలువురు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యారు. సాధారణ సమయాల్లో రోడ్డుపై నుంచి దుమ్ము లేచి రోడ్డు పక్కనే ఉన్న ఇళ్లలోకి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే ఉన్న నిర్మాణాలు తొలిగించడం, రోడ్డుపై మట్టి వేయడం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి పనులను చేపట్టి పనులు పూర్తి చేయకుండా పత్తా లేకుండా పోయారు. కాంట్రాక్టర్ రోడ్డు పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయి నెల రోజులవుతున్నా పట్టించుకున్నవారే లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు విస్తరణలో జాప్యం...

రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 60 ఫీట్ల లోపల రోడ్డు పక్కన ఉన్న ఇళ్లు, షెడ్ల నిర్మాణాలను తొలిగించాలని వారికి నోటీసులు అందజేసి పనులు ప్రారంభించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న నిర్మాణాలను వెంటనే తొలిగించారు. కొన్ని చోట్ల శాశ్వత కట్టడాలను కూడా తొలిగించారు. మరికొన్ని అలాగే వదిలేసి పనులు చేపట్టడంపై తొలగించిన వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంత వెడల్పులో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారో తెలియజేసిన తర్వాతనే నిర్మాణాలను కూలిచ్చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు రోడ్డు విస్తరణలో పక్షపాతంగా వ్యవహరిస్తూ పనులు చేపడుతున్నారని అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

> **పనులు ప్రారంభిస్తాం**
>
> వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులు నిలిపేశాం. వచ్చే వారంలో పనులు ప్రారంభిస్తాం. విస్తరణ పనులకు సంబంధించి రోడ్డు డివైడర్ నిర్మాణం నుంచి ఇరువైపులా 60 ఫీట్లతో చేపట్టిన కొలతల ప్రకారం పనులు చేపడుతాం. రోడ్డుకు ఇరువైపులా డ్రైన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగానే అడ్డుగా ఉన్న భవనాలను తొలగిస్తాం.
>
> – శశాంక్, ఆర్అండ్‌బీ ఏఈ

తాగునీటి సౌకర్యం కల్పించండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: డివిజన్ ఐలా పరిధిలోని పరిశ్రమలకు మంచినీటి కనెక్షన్లు లేకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లో జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధి ఉస్మాన్‌నగర్‌లోని బీహెచ్ఈఎల్ బీఈమ్యాక్ సొసైటీ కాలనీవాసులకు మంచినీటి కనెక్షన్ల కోసం వసూలు చేస్తున్న ఇంప్రూవ్‌మెంట్ చార్జీలను తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జలమండలి ద్వారా చేపడుతున్న మంచినీటి సరఫరా, రిజర్వాయర్లు, నూతన కనెక్షన్లపై చర్చించారు. ప్రధానంగా ఐలా పారిశ్రామికవాడలోని వందలాది పరిశ్రమలలో నిత్యం వేలాదిమంది కార్మికులు పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారని తెలిపారు. పరిశ్రమలకు మంచినీటి కనెక్షన్లు లేకపోవడం వల్ల తాగునీటి కోసం ప్రతిరోజు కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని ఆయనకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఐలా ప్రతినిధులు సురేందర్ రెడ్డి, శ్రీనివాస్, నరసింహ, మధు, శివ నారాయణ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ప్రోత్సాహం అందిస్తే.. అద్భుతమైన విజయాలు సాధిస్తారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఉషూ (కిక్ బాక్సింగ్) రాష్ట్రస్థాయి పోటీల్లో బీరంగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అశ్విని అండర్-17 విభాగంలో బంగారు పతకం సాధించింది. కాశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఇదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రుత్విక రెడ్డి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వారిని అభినందించారు.

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి పట్టణంలోని పోతిరెడ్డి పల్లి చౌరస్తా వద్ద, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ, అలాగే పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఏడు మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దీఖీ నలుగురికి రూ.1500, మిగతా ముగ్గురికి రూ.1000, చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నేడు పల్స్ పోలియోపై సమావేశం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదలలో ఈనెల 12న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం మండలస్థాయి అధికారుల సమావేశం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి మధుకర్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో జరిగే సమావేశాల్లో పోలియో చుక్కలు వేసేలా విద్యార్థులకు నినాదాలతో అవగాహన కల్పించి పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, ఆయా గ్రూపుల్లో సమాచారం చేరవేయాలని కోరారు.

నీటి సరఫరా పునరుద్ధరణ

న్యాల్‌కల్(జహీరాబాద్): మిషన్ భగీరథ నీటి సరఫరా ఎట్టకేలకు ప్రారంభమైంది. మిషన్ భగీరథ పథకంలో తాత్కాలిక పద్ధతిన 23 మంది కార్మికులు పని చేస్తున్నారు. వారికి 8 నెలలుగా జీతాలు అందడం లేదు. కాంట్రాక్టర్‌కు పలుమార్లు విన్నవించినా జీతాలు చెల్లించకపోవడంతో నీటి సరఫరాను నిలిపేసి ఆందోళన చేపట్టారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపో యింది. ఫలితంగా తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాంట్రాక్టర్ 6నెలల జీతాలు చెల్లించడంతో కార్మికులు ఆందోళన విరమించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో తాగు నీటి సమస్య తొలగిపోయింది.

వేతనాలు చెల్లించాలని నిరసన


వినతిపత్రం ఇస్తున్న మహిపాల్ కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టర్ కార్మికులు గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్, యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. తక్కువ వేతనంతో పని చేస్తున్న కార్మికులకు ప్రతి నెల జీతాలు సక్రమంగా ఇవ్వడంలేదని వాపోయారు. రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. దసరా పండగకు వేతనాలు చెల్లించలేదని, దీపావళి పండగకైనా ఇవ్వాలని కోరారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంజీవ్, పున్నమ్మ, సద్దమ్మ, కాంతమ్మ మోహన్ ఉన్నారు.

టపాసుల దుకాణాల్లో జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: టపాసుల దుకాణాల్లో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని రకాల జాగ్రత్తలను పాటించాలని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీధర్ సూచించారు. గురువారం దీపావళి సందర్భంగా ఏర్పాటు చేయనున్న టపాసుల దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. దుకాణాలకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. డ్రమ్ముల్లో ఇసుక, నీళ్లు అందుబాటులో ఉంచాలన్నారు. తహసీల్దార్ హసీనాబేగం, సీఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు లేక.. నిండు గర్భిణి అవస్థలు


పురిటి నొప్పులతో నడుస్తున్న గర్భిణి

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని వాచుతండాకు చెందిన నిండు గర్భిణి ప్రసవం కోసం కాలినడకే శరణ్యంగా మారింది. పిట్లం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న తండాకు మట్టి రోడ్డు ఉన్నా.. సక్రమంగా లేక వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. తండాకు చెందిన నిఖిత బాయి పురిటి నొప్పులతో నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడింది. అక్కడికి వచ్చిన అంబులెన్స్‌లో కంగ్టి పీహెచ్‌సీకి తరలించగా మగబిడ్డకు జన్మనిచ్చింది. తండాలకు రోడ్లు వేయడంలో నాయకులు, అధికారులు నిర్లక్ష్యం వహించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అందోల్ చెరువు పునరుద్ధరణకు రూ.3 కోట్లు

డిప్యూటీ ఈఈ కృష్ణమోహన్


పెద్ద చెరువును పరిశీలిస్తున్న అధికారులు

జోగిపేట(అందోల్): అందోల్ పెద్ద చెరువులోకి మురికినీరు రాకుండా చెరువు పునఃరుద్ధరణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ జోగిపేట మున్సిపాలిటీ డిప్యూటీ ఈఈ కృష్ణ మోహన్ తెలిపారు. గురువారం పెద్ద చెరువును ఏఈ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ ఎ.రవీందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులోకి పట్టణంలోని ఐదు వైపుల నుంచి మురికినీరు వచ్చి చేరుతుండటంతో చెరువు నీరు కలుషితమవుతోంది. అమృత్ పథకం కింద ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయిందని చెప్పారు. చెరువులోకి మురికి నీరు రాకుండా ఆ నీటిని ఎంపీపీ కార్యాలయం పక్కన ఉన్న కల్వర్టు మీదుగా మంజీరా నదివైపు తరలించేలా పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

జీతాల కోసం ఎదురుచూపులు


అధికారులకు విజ్ఞప్తి చేస్తున్న కార్మికులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగైదు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పరిస్థితులు దుర్భరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నా సమయానికి వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సకాలంలో వేతనాలు అందేలా చూడాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు


విలేకరులతో మాట్లాడుతున్న చిట్టిబాబు

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధిపై ఓర్వలేకనే బీఆర్ఎస్ పార్టీ విమర్శలు చేస్తోందని అందోల్-జోగిపేట మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు అన్నారు. గురువారం ఆత్మకమిటీ డైరెక్టర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండేళ్లలో జోగిపేట మున్సిపాలిటీలో రూ.250 కోట్ల అభివృద్ధి పనులు నడుస్తున్నాయన్నారు. రూ.80 కోట్లతో నిర్మిస్తున్న అజ్జమర్రి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని, మల్లన్న గండి నుంచి అజ్జమర్రి శివారు వరకు మట్టి రోడ్డు నిర్మాణం పూర్తయ్యిందని, మంజీరాలో నీరు తగ్గగానే బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమవుతుందని తెలిపారు. జోగిపేట పట్టణం కళ కోల్పోవడానికి ప్రధాన కారకులు బీఆర్ఎస్ నాయకులేనని ఆరోపించారు. సంగుపేట వద్ద నుంచి బైపాస్ నిర్మిస్తున్నా ఆ పార్టీ ఎమ్మెల్యేలు పట్టించుకోలేదని దీనివల్ల పట్టణంలో వ్యాపారం పూర్తిగా దెబ్బతిన్నదని మండిపడ్డారు. అందోల్‌లో రూ.43 కోట్లతో నర్సింగ్ కళాశాల, రూ.60 కోట్లతో 150 పడకల ప్రభుత్వాసుపత్రిని మంజూరు చేసి, 60 శాతం పనులు కూడా పూర్తయ్యాయన్నారు. రూ.6 కోట్లతో మున్సిపాలిటీ భవన నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. రూ.20 కోట్లతో డివైడర్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సమావేశంలో ఆత్మకమిటీ డైరెక్టర్లు చిట్యాల మధు, యాదయ్య, ఖాలీద్, నాయకులు చోటుఖాన్, రాజు, హాజీ, అడ్డు, నజీర్‌లతో తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మేము సైతం


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పటాన్‌చెరు: పర్యావరణ స్థిరత్వాన్ని ప్రోత్సహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని మహిళా సాధికారత విభాగం (డబ్ల్యూఈసీ) గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించింది. పచ్చదనం, పరిశుభ్రత మరింత స్థిరమైన ప్రాంగణ వాతావరణాన్ని పెంపొందించడంలో గీతం కుటుంబ సభ్యులంతా సమష్టి బాధ్యత తీసుకునేలా ప్రేరేపించడం ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశం. ఈ సందర్భంగా మహిళా సాధికారత విభాగం చైర్ పర్సన్ ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ మాట్లాడుతూ.. పర్యావరణ స్పృహను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, సీనియర్ అధ్యాపకురాలు ప్రొఫెసర్ లక్ష్మి, క్రీడావిభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నారాయణరావు, ఎస్టేట్ అధికారి సతీశ్ పాల్గొన్నారు.

సదాశివపేట అభివృద్ధికి కృషి


విలేకర్లతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అభ్యర్థన మేరకు అప్పటి మంత్రి హరీశ్‌రావు వివిధ అభివృద్ధి పనులకు రూ. 25 కోట్ల నిధులు మంజూరు చేశారని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్లన్న, శివరాజ్‌పాటిల్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బసవ సేవాసదన్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబిస్తూ అభివృద్ధికి అడ్డుపడుతుందని వేదన వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. పది కోట్ల పనులకు ఈ నెల 7న టెండర్లు పిలిచారని తెలిపారు. అప్పటి సీఎం కేసీఆర్ 324 పనులకు రూ.25 కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం 208 పనులకు మాత్రమే ప్రస్తుత ప్రభుత్వం రూ.13 కోట్ల నిధులు మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ నాయకులు అంజయ్య, అక్బర్ హుస్సేన్, ముద్దనాగనాథ్, శివ, నాసీర్, జబ్బార్, దిడిగే నాగేశ్, ఫణి, కామేల్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం..


మాట్లాడుతున్న ఆదర్శ్ రెడ్డి తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తామని నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్ రెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఛలోబస్ భవన్ కార్యక్రమంలో భాగంగా ఆయనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని మండిడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. పెంచిన బస్సు చార్జీలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. కార్యకక్రమంలో నాయకులు పరమేశ్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు పోలీసులు బీఆర్ఎస్ నాయకులు సోమిరెడ్డి, లచ్చిరాం నాయక్, దేవేందర్ యాదవ్, నాగరాజు, బాలాజీ, శ్రీకాంత్ రెడ్డిలను ముందస్తు అరెస్ట్ చేశారు.

కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సింహులు, పాక్స్ చైర్మన్ ప్రవంతిరెడ్డి, సీనియర్ నాయకులు కలీం, మునీరుద్దీన్, రవికిరణ్, మొయిజ్ పాల్గొన్నారు.

మల్బరీ తోటల పరిశీలన


మల్బరీ తోటను పరిశీలిస్తున్న పండరి

జహీరాబాద్ టౌన్: మండలంలోని మల్‌చెల్మ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మల్బరీ తోటలను గురువారం పట్టు పరిశ్రమలు, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి పండరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్బరీ పంటకాలం తక్కువని, లాభాలు ఎక్కువని చెప్పారు. ఎకరానికి రూ.10 వేల ఖర్చురాగా.. రూ. 60 వేల వరకు ఆదాయం వస్తుందన్నారు. మల్బరీ సాగు పట్టు ఉత్పత్తిలో రెండు దశలు ఉంటాయని, మల్బరీ సాగు, రెండోది ఆకులు తినిపించి పట్టు పురుగులను పెంచడమన్నారు. అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టం రాదన్నారు. మల్‌చెల్మ గ్రామ మహిళా రైతులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం ఆయన పట్టు పురుగుల పెంపకాన్ని పరిశీలించారు. జిల్లా అధికారి వెంట మండల సేరికల్చర్ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.